

నేడు 'ప్రతిధ్వని' కవితా సంకలనం ఆవిష్కరణ

ప్రజాశక్తి - పెద్దాపురం

పట్టణంలో 3 రోజులపాటు జరిగే సిపిఎం జిల్లా మహాసభల సందర్భంగా సాహితీ స్రవంతి సహకారంతో ప్రచురించిన ప్రతిధ్వని కవితా సంకలనం ఈనెల 20వ తేదీన ఆవిష్కరిస్తామనిసాహితీ స్రవంతి కార్యదర్శి కొత్త శివ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో జరిగే ఈ ఆవిష్కరణ సభకు సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ జోస్యుల కృష్ణబాబు అధ్యక్షత వహిస్తారన్నారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు కవితా సంకలనాన్ని ఆవిష్కరిస్తారన్నారు. సాహితీ స్రవంతి వర్కింగ్ ఎడిటర్ సత్యాజీ ప్రతిధ్వని పుస్తక సమీక్ష చేస్తారన్నారు. కవులు, కళాకారులు, సాహిత్యాభిమానులు పాల్గొని ఈ సభను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

మహాసభకు అంతా సిద్ధం

- ముస్తాబైన పెద్దాపురం పట్టణం
- నేటి నుంచి సిపిఎం జిల్లా మహాసభ
- మూడు రోజులపాటు నిర్వహణకు ఏర్పాట్లు
- తొలి రోజు ఫొటో ఎగ్జిబిషన్, కవితా గోష్ఠి
- రేపు ప్రజా ప్రదర్శన, బహిరంగ సభ
- హాజరుకానున్న రాష్ట్ర నాయకులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

సిపిఎం కాకినాడ జిల్లా మహాసభకు వేళాయింది. కళలకాణాచి పెద్దాపురం పట్టణం దీనికి వేదికగా నిలిచింది. సిపిఎం 24వ జిల్లా మహాసభకు అంతా సిద్ధమైంది. శుక్రవారం నుంచి మూడు రోజులపాటు మహాసభ జరుగనుంది. మహాసభకు జిల్లా నాయకత్వం ఇప్పటికే అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసింది. కళలకు, కళాకారులకు, ఉద్యమ సారథులకు, ఉద్యమాలకు పుట్టినిల్లు అయిన చారిత్రక పెద్దాపురం ఎర్రజెండాలతో ఎరుపెక్కింది. తోరణాలు, ఫ్లెక్సీలతో మహాసభ ప్రాంగణమంతా ఎరుపురంగు పులుముకుంది.

మహాసభ జరుగనున్న ప్రాంతానికి సీతారాం ఏచూరి నగర్‌గా నామకరణం చేశారు. ముఖ్య అతిథులుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఉమామహేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎవి.నాగేశ్వరరావు హాజరుకానున్నారు. మూడు రోజులపాటు జరుగనున్న మహాసభలో తొలిరోజైన శుక్రవారం యాసలపు సూర్యారావు భవన్‌లో ఫోటో ఎగ్జిబిషన్, కవితా సంకలనం ఆవిష్కరణ, కవితా గోష్టి కార్యక్రమాలు జరుగుతాయి. ఈ కార్యక్రమానికి సిపిఎం సీనియర్ నాయకులు టిఎస్.ప్రకాష్ హాజరుకానున్నారు.

రెండో రోజు శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పట్టణ కొప్పుల వెలమ సంక్షేమ సంఘం భవనంలో ప్రతినిధుల సభ జరుగుతుంది. మధ్యాహ్నం 3 గంటలకు పెద్దాపురం ఆంజనేయ స్వామి గుడి సెంటర్లో బహిరంగ సభ జరుగుతుంది. అంతకంటే ముందు మున్సిపల్ సెంటర్ నుంచి నాగేశ్వరరావు వీధి, మరిడమ్మ గుడి సెంటర్, పాత బస్టాండ్, దర్గా సెంటర్, వెంకటేశ్వర స్వామి టెంపుల్ సెంటర్ మీదుగా బహిరంగ సభ ప్రాంతానికి వేలాది మందితో భారీ ప్రదర్శన జరగనుంది. ప్రదర్శన అగ్ర భాగాన ప్రజానాట్యమండలి కళాకారులు వివిధ కళారూపాలను ప్రదర్శిస్తారు. బహిరంగ సభలో రాష్ట్ర నాయకులతో పాటు జిల్లా ముఖ్య నాయకులు ప్రసంగించనున్నారు. జిల్లా నలుమూలల నుంచి సిపిఎం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈ ప్రదర్శన, బహిరంగ సభలో పాల్గొంటారని ఆ పార్టీ జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ తెలిపారు. బహిరంగ సభ ముగిసిన అనంతరం తిరిగి ప్రతినిధుల సభ ప్రారంభమవుతుందని తెలిపారు. మూడో రోజు ఆదివారం చర్చలు, ప్రజా సమస్యలపై తీర్మానాలతోపాటు నూతన జిల్లా కమిటీ ఎన్నిక జరగనుంది. మహాసభను విజయవంతంగా నిర్వహించేందుకు కొద్దిరోజులుగా సిపిఎం జిల్లా నాయకత్వం, పెద్దాపురం పార్టీ కేడర్ విస్తతంగా శ్రమించింది. బహిరంగ సభకు పెద్దఎత్తున జనం తరలిరావాలని జిల్లా నేతలు పిలుపునిచ్చారు. పండుగ వాతావరణంలో మహాసభ నిర్వహించేందుకు పార్టీ కేడర్ అంతా సమాయత్తమై ముందుకు సాగుతోంది.





తోరణాలు, ఫ్లెక్సీలు కడుతున్న సిపిఎం కార్యకర్తలు



అరుణపతాకాలను సిద్ధం చేస్తున్న కార్యకర్తలు

సమస్యలపై చర్చలు

ఈ మహాసభల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై విస్తతంగా చర్చించనున్నారు. గడిచిన మూడేళ్లలో పార్టీ చేపట్టిన పోరాటాలు, అనుభవాలు, పేద రైతులు, గిరిజనులు, దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రతినిధులు సుదీర్ఘంగా చర్చించనున్నారు. జిల్లా సమగ్ర అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలపై ఈ మహాసభల్లో ప్రత్యేకమైన తీర్మానం చేయనున్నారు. అలాగే రంగాల వారీగా గ్రూపు చర్చలతో పాటు పలు తీర్మానాలు చేయనున్నారు. ప్రధానంగా సబ్ ప్లాన్ ప్రాంతంలో మౌలిక సదుపాయాలు కల్పించి గిరిజనుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని చర్చలు జరగనున్నాయి. విలీన గ్రామాల సమస్యలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, జీడి పిక్కల రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, భూ సమస్యలు పరిష్కరించాలని, పరిశ్రమల స్థాపన ద్వారా ఉపాధి కల్పించాలని తీర్మానాలు జరగనున్నాయి. అలాగే పచ్చని పంటలు పండే భూముల్లో కాకుండా నూతన ఎయిర్‌పోర్ట్ ను ఖాళీగా ఉన్న భూముల్లో ఏర్పాటు చేయాలని తీర్మానం జరగనుంది. దళితుల స్మశానాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, భూ యజమానులతో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేయాలని, మత్స్యకారులకు తక్షణమే వేట నిషేధ పరిహారం అందించాలని, గ్రామాల సమగ్ర అభివృద్ధిపై నిర్ణయం తీసుకోవాలని, చమురు సంస్థల నుంచి రావాల్సిన అభివృద్ధి నిధులను రాబట్టాలని, జిల్లాలో తాగునీరు, సాగునీరు సమస్యలను పరిష్కరించాలని, ప్రాజెక్టుల ఆధునీకరణ చేపట్టాలని, రహదారుల నిర్మాణానికి త్వరితగతిన చర్యలు వంటి అంశాలపై చర్చించి తీర్మానాలు చేయనున్నారు. ఈ మహాసభల్లో గత కార్యక్రమాలను సమీక్షించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందించనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యుత్తు చార్జీల భారాలపై చర్చించి ఉద్యమ కార్యాచరణను సిద్ధం చేయనున్నారు.



అమిత్ షా వ్యాఖ్యలపై నిరసన వ్యక్తం చేస్తున్న దళిత, ప్రజాసంఘాల నాయకులు

అమిత్ షా వ్యాఖ్యలపై ఆగ్రహం

-కేంద్ర హోంమంత్రిని బర్తరఫ్ చేయాలని డిమాండ్

-కెవిపిఎస్, దళిత, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి - కాకినాడ, తాళ్లరేవు

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై పార్లమెంట్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై పలు దళిత, ప్రజాసంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. హోంమంత్రి పదవి నుంచి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశాయి. పార్లమెంట్ సాక్షిగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం స్థానిక ఇంద్రపాలెం అంబేద్కర్ విగ్రహంవద్ద కెవిపిఎస్, దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. తొలుతగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి ప్రముఖ న్యాయవాది జవహర్ అలీ, పలు సంఘాల నేతలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దళిత, ప్రజా సంఘాల నాయకులు, కెవిపిఎస్ నాయకులు మాట్లాడారు. కేంద్ర మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు అత్యంత దారుణమైనవన్నారు. ఈ వ్యాఖ్యలు అంబేద్కర్‌ను అభిమానించే బారత దేశంలో నూటికి 85 శాతంగా ఉన్న దళిత బహుజనులను కించపరచడమేనని అన్నారు. రాజ్యాంగ బద్ధంగా ప్రమాణం చేసి ఎన్నికైన వ్యక్తి రాజ్యాంగ నిర్మాతని కించపరచడం అత్యంత దుర్మార్గ మన్నారు. ఈ ఘటనను దేశ ప్రజలందరూ ఖండించాలని కోరారు. సమాజంలో అంటరాని తనం, కుల వివక్ష పోవాలని, సామాజిక అసమానతలపై అలుపెరగని పోరాటం చేసిన గొప్ప ఉత్తమ దేశ భక్తుడు, మహోన్నతమైన వ్యక్తి అంబేద్కర్ అని కొనియాడారు. దేశంలో నిజమైన అభివృద్ధిని కాంక్షించి జీవితాంతం కృషి చేసిన వ్యక్తి అంబేద్కర్ అన్నారు. అలాంటి వ్యక్తిపై నోరు పారేసుకోవడం అన్యాయమన్నారు. సామాజిక న్యాయాన్ని, సమానత్వాన్ని దెబ్బతీస్తూ మను ధర్మాన్ని ముందుకు తెస్తూ ప్రజల భవిష్యత్తుని నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షాను తక్షణం పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అమిత్ షాను భర్తరఫ్ చేసేవరకు ఈ ఉద్యమం ఆగదని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు అయితాబత్తుల రామేశ్వర రావు, సామాజిక న్యాయ సాధన సమితి అధ్యక్షులు డాక్టర్ భానుమతి, కెవిపిఎస్ జిల్లా నాయకులు మోర్త రాజశేఖర్, యునైటెడ్ ఎస్‌సి, ఎస్‌టి ఫోరం నాయకులు తుమ్మల నూకరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దళిత, ప్రజా సంఘాల నాయకులు కెఎస్.శ్రీనివాస్, కింగ్, పిల్లి రామారావు, పెనుమాల సుదీర్, కాశీ బాలయ్య, తాడి బాబ్జి, జి.బేబీరాణి, పలివెల వీరబాబు, తోకల ప్రసాద్, కెవిపిఎస్ నాయకులు బి.సురేష్ కుమార్, కె.సింహాచలం, కటారి పద్మనాభం, కె.సత్యానందం, రాపాక రాజకృష్ణ పాల్గొన్నారు. అలాగే తాళ్లరేవు అంబేద్కర్ భవనం వద్ద కెవిపిఎస్ ఆధ్వర్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ అధ్యక్షులు విప్పర్తి శ్రీనివాస రావు, పులపకూర కృష్ణ, వల్లు రాజ బాబు, ఎలిపే నాగేశ్వరావు, అదృష్టదీపుడు, నేరే డు మిల్లి త్రిమూర్తులు, నల్లి ఈశ్వరరావు, సాధనాల సాయి, వడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో కార్పొరేట్ వైద్యం

ప్రజాశక్తి - తొండంగి

పేద ప్రజలకు తక్కువ ఖర్చుతో కార్పొరేట్ వైద్యాన్ని అందించాలని ఎంఎల్‌ఎలు యనమల దివ్య, వరుపుల సత్యప్రభ అన్నారు. గురువారం స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులో ఆధునిక సౌకర్యాలతో కూడిన సూర్య ఎమర్జెన్సీ చిల్డ్రన్స్ కార్పొరేట్ ఆసుపత్రిని వారు ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సరైన కార్పొరేట్ ఆసుపత్రి లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రోగాల భారిన పడిన ప్రజలు సుదూర ప్రాంతాలకు వెళ్లి వైద్య సేవలు పొందాలంటే అనేక వ్యయప్రయాసలకు గురౌతున్నారని అన్నారు. వాటిని అదిగమించేందుకు అన్నవరంలో చిల్డ్రన్స్ ఆసుపత్రిని ఏర్పాటు చేసిన డాక్టర్ శివప్రసాద్ అభినందనీయులన్నారు. డాక్టర్ శివప్రసాద్ మాట్లాడుతూ ఉన్న ఊర్లో పిల్లలకు సరియైన వైద్య సదుపాయం లేక అనేక ఇబ్బందులు పడేవారని, అందుకనే 24 గంటలూ వైద్య సేవలు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ఆసుపత్రిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు వరపుల రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ యనమల దివ్య

ఎస్‌ఆర్‌ఎమ్‌టి ఆసుపత్రిని వినియోగంలోకి తేవాలి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో ఎస్‌ఆర్‌ఎంటి సంస్థ సిఎస్‌ఆర్ నిధులు రూ.40 లక్షలతో నిర్మించిన ఆసుపత్రిని వినియో గంలోకి తీసుకురావాలని మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్ కోరారు. గురువారం రమణయ్య పేటలో ప్రయివేటు కార్యక్రమంలో పాల్గొనేం దుకు వచ్చిన ఎంఎల్‌ఎ పంతం నానాజీకి ఈ మేరకు ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2016లో పండూరు గ్రామంలో ఆసుపత్రిని నిర్మించారని, అయితే నాటి నుంచి నేటికీ ఆ ఆసుపత్రిని వినియోగంలోకి తీసుకు రాలేదన్నారు. దీంతో రమణయ్యపేట, తదితర గ్రామాల ప్రజలు అనారోగ్యానికి గురియైతే కాకినాడ జిజిహెచ్‌కు వెళ్లాల్సివస్తుందని అన్నారు. ఈ ఆసుపత్రిని వినియోగంలోకి తీసుకురావడం ద్వారా రమణయ్యపేట, వలసపాకల, వాకలపూడి, సర్పవరం, తిమ్మాపురం తదితర గ్రామ ప్రజలకు వైద్యం అందుబాటులోకి వస్తుందన్నారు. వైద్య శాఖ మంత్రితో సంప్రదించి ఈ ఆసుపత్రిలో వైద్య సేవలు అందిం చడానికి కృషి చేస్తానని ఎంఎల్‌ఎ నానాజీ హామీ ఇచ్చారు.



ఎంఎల్‌ఎ నానాజీకి వినతిపత్రం ఇస్తున్న అడబాల

34వ రోజుకు జీడిపిక్కల కార్మికుల నిరసన

ప్రజాశక్తి - ఏలేశ్వరం

చిన్నింపేట జీడిపిక్కల కార్మికులు నిరసన గురువారానికి 34వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు యాజమాన్యం, ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ కార్మికులు ఫ్యాక్టరీ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యులు రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ యాజమాన్యం చట్ట వ్యతిరేకంగా పరిశ్రమను మూసివేసి వెళ్లిపోవడం జరిగిందన్నారు. దీనికి ప్రభుత్వం ఎటువంటి అనుమతులు లేవని, దీనిపై అనుమతులు లేకుండా మూసివేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుని కార్మికులకు ఉపాధి కల్పించాలని అన్నారు. పలుసార్లు అధికారులకు, నాయకులకు మొరపెట్టుకున్న వారిలో స్పందన రాకపోవడం దారుణమన్నారు. తక్షణమే పరిశ్రమను ప్రభుత్వం తీసుకుని కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు ఎ.వీరబాబు, గోవిందు, కృష్ణరావు, ధర్మజీ, ఒ.దుర్గప్రసాద్, గోపి, లోవరాజు, శివ, జయలక్ష్మి, అన్నపూర్ణ, ఒ.దుర్గ, చంటి, శివాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న సిఐటియు నాయకుడు

ప్రమాణ స్వీకారంలో గందరగోళం

ప్రజాశక్తి - పిఠాపురం

పిఠాపురం అసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారంలో గందరగోళం నెలకొంది. సభావేదికపై ఏర్పాటు చేసిన బ్యానర్‌పై డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ ఫొటో లేకపోవడంపై జనసేన నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎంఎల్‌ఎ ఫోటో వేయకపోవడం ఏమిటని నిలదీశారు. సమావేశాన్ని ప్రారంభించే ప్రయత్నం చేయగా ఆసుపత్రి సూపరింటెండెంట్ సుజాతను అడ్డుకొన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాస్, జిల్లా జనసేన అధ్యక్షుడు తుమ్మల రామస్వామి జనసేన కార్యకర్తలకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. పవన్ కల్యాణ్ ఫోటో ఉండే బ్యానర్ ఏర్పాటు చేసిన తరువాతే సమావేశాన్ని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. దీంతో ప్రమాణస్వీకార కార్యక్రమం గందరగోళంగా మారింది. ఈ నేపథ్యంలో పవన్ కళ్యాణ్ ఫోటోతో బ్యానర్‌ను తెచ్చి సభావేదికపై కట్టారు. ఆ బ్యానర్‌లో సిఎం చంద్రబాబు ఫోటో లేదంటూ మాజీ ఎంఎల్‌ఎ ఎస్‌విఎస్.వర్మ అభ్యంతరం వ్యక్తం సభా వేదిక నుంచి వెళ్లిపోయారు. ఆయనతోపాటు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడిగా నియమితులైన వేణుం సురేష్, టిడిపి నాయకులు అక్కడ నుంచి వెళ్లిపోయారు. జనసేనకు చెందిన ఆసుపత్రి అభివృద్ధి కమిటి సభ్యుడు బొజ్జా కుమార్‌బాబు ప్రమాణస్వీకారం చేశారు.



డిప్యూటీ సిఎం ఫొటో లేదంటూ జనసేన కార్యకర్తలు నినాదాలు

ఆదిత్య అసిస్టెంట్ ప్రొఫెసర్‌కి డాక్టరేట్

ప్రజాశక్తి - గండేపల్లి



సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ దారా రాంబాబు డాక్టరేట్ సాధించారు. కర్నూలుకు చెందిన ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ (ఐఐఐటిడిఎం) నుంచి డాక్టరేట్ సాధించిన తొలి వ్యక్తి దారా రాంబాబు అని ఆదిత్య విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి అన్నారు. ప్రొఫెసర్ డాక్టర్ మువ్వల పుల్లారావు నేతృత్వంలో దారా రాంబాబు సమర్పించిన "సోలార్ థర్మల్ ఎనర్జీ" అంశంపై డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పొందారని తెలిపారు. డాక్టర్ దారా రాంబాబు భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, క్యాంపస్ డైరెక్టర్. డాక్టర్ ఎమ్.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, డీన్ అకడెమిక్స్ పి.రవికుమార్, అడ్మినిస్ట్రేషన్ డీన్ డాక్టర్ వైకెఎస్.సుబ్బారావు, డీన్ డాక్టర్ సంజీవ్‌రావు, డీన్ కెరీర్ గైడెన్స్ డాక్టర్ డి.కిషోర్, విభాగాధిపతి డాక్టర్ స్టాన్లీ అభినందనలు తెలిపారు.

బీచ్ పార్కులోకి త్వరలోనే సందర్శకుల అనుమతి

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

కుడా ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న బీచ్ పార్కు లోనికి త్వరలో సందర్శకులను అనుమతించడం జరుగుతుందని ఛైర్మన్ తుమ్మల బాబు, వైస్ ఛైర్మన్ భావన అన్నారు. గురువారం కుడా పాలకవర్గం సమావేశం ఛైర్మన్ తుమ్మల బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించి చర్చించారు. బీచ్ పార్కులో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి అనుమతులు మంజూరు చేశారు. టియు 142 ఎం యుద్ధ విమాన ప్రదర్శనకు ఎంట్రీ టికెట్ ధర నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో కుడా సెక్రటరీ కాళీబాబు, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు పుచ్చలపల్లి సుందరయ్య ఫొటో ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురంలో జరుగుతున్న సిపిఎం 24వ జిల్లా మహాసభల సందర్భంగా ఈనెల 20వ తేదీన పుచ్చలపల్లి సుందరయ్య ఫోటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసినట్లు సిపిఎం మండల కన్వీనర్ క్రాంతికుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ఈ ఫోటో ఎగ్జిబిషన్‌ను సిపిఎం సీనియర్ నాయకులు టిఎస్.ప్రకాష్ ప్రారంభిస్తారని తెలిపారు.

పంచాయతీ కార్మికులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి - కరప

కరప పంచాయతీ పారిశుధ్య కార్మికులుకు అడబాల రత్నప్రసాద్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. మాజీ గ్రామ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు కోరిన వెంటనే ట్రస్ట్ ద్వారా దుప్పట్లు సమకూర్చారు. ఈ దుప్పట్లను సర్పంచ్ సాదే ఆశాజ్యోతి భర్త సాదే కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు దుప్పట్లను ఏర్పాటు చేసిన అడబాల ట్రస్ట్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

21న ఏలేశ్వరంలో మినీ జాబ్ మేళా

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఈ నెల 21న స్థానిక వైష్ణవి కళాశాల ఆవరణలో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో మినీ జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ ఆళ్ల సూర్యనారాయణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాకు ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ, ఐటిఐ చదివిన 19 నుంచి 35 సంవత్సరాల లోపు వయసు గలవారు అర్హులన్నారు. జాబ్ మేళాకు హాజరైన అభ్యర్థులను ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేసి నియామక పత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు. ఆసక్తి అర్హత కలిగిన అభ్యర్థులు https//naipunyam.ap.gov.in. లో రిజిస్ట్రేషన్ చేయించుకుని రెజ్యూమ్‌తో సహా ఈనెల 21న శనివారం హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 8688977277, 8247788247, 9182936777 నెంబర్లను సంప్రదించాలన్నారు.

స్కూల్ లాగిన్‌లో సవరణలకు అవకాశం

ప్రజాశక్తి - గొల్లప్రోలు

10వ తరగతి పరీక్షల కొరకు ఆన్‌లైన్ దరఖాస్తు ఫారంలో తప్పులను సరి చేసుకునేందుకు స్కూల్ లాగిన్‌లో సవరణకుల అవకాశం కల్పించినట్లు ఎంఇఒ-2 బి.శివప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23వ తేదీ వరకూ స్కూల్ లాగిన్ వెబ్ అప్లికేషన్‌లోని విద్యార్థులకు అవసరమైన ఏమైనా సవరణలు వాటిని నవీకరించడానికి ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

కార్టూ'నిజం'



జారుడుబల్లపై రూపాయి

కొత్త కనిష్టం వద్ద ముగింపు

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - పిఠాపురం

8వ రాష్ట్రస్థాయి మెన్ బాక్సింగ్ పోటీలు స్థానిక ఆర్‌ఆర్‌బిహెచ్‌ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ఘనంగా ప్రారంభమ య్యాయి. ఈ పోటీలను పిఠాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాసు, ద్రోణాచార్య అవార్డు గ్రహీత డాక్టర్ ఐ.వెంకటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ సెక్రెటరీ బి.ఎ.లక్ష్మణ్‌దేవ్, కోశాధికారి కె.శ్రీనివాసరావు, టెక్నికల్ కమిటీ ఛైర్మన్ డి.నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. అనేకమంది క్రీడల్లో పాల్గొని తమ పుట్టిన ప్రాంతానికి, రాష్ట్రానికి, దేశానికి ఎంతో పేరు ప్రఖ్యాతలు తెచ్చి పెట్టారన్నారు. ఈ పోటీలకు రాష్ట్ర నలుమూలల నుంచి 150 మంది బాక్సర్స్, 50 మంది కోచ్ మేనేజర్స్, టెక్నికల్ ఆఫీసర్స్ పాల్గొన్నారని పోటీల నిర్వహణ కార్యదర్శి పి.లక్ష్మణరావు తెలిపారు. ఈ పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచిన వారు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. సెమీఫైనల్ బాక్సింగ్ పోటీలను పిఠాపురం మున్సిపల్ కో అప్షన్ సభ్యులు గండేపల్లి రామారావు, కౌన్సిలర్ రాజేష్, నాయకులు కె బుజ్జి, భూషణం ప్రారంభించారు. ఈ పోటీల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వి.కేశవరావు, హెచ్‌ఎం రామకృష్ణ, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రగ్బి అసోసియేషన్ చైర్మన్ వి.రామన్నరాజు అధ్యక్షులు ఇమిడిశెట్టి నాగేంద్రకుమార్, కోశాధికారి బి.నవీన్ పాల్గొన్నారు.



బాక్సింగ్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు



సురేష్‌ను అభినందిస్తున్న వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి

వైసిపి పట్టణ అధ్యక్షునిగా పాగా సురేష్

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట పట్టణ వైసిపి అధ్యక్షులుగా 31వ వార్డు కౌన్సిలర్ పాగా సురేష్‌కుమార్ నియమితులయ్యారు. వైసిపి అధినేత వైఎస్. జగన్మోహన్ రెడ్డి నియామక ఉత్తర్వులు ఇచ్చారు. ఈ సందర్భంగా పెద్దాపురం నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో సురేష్‌కుమార్ గురువారం వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పట్టణ అధ్యక్షులుగా నియమితులైన సందర్భంగా సురేష్ కుమార్‌ను పట్టణ పరిధిలోని పార్టీ నాయకులు, కౌన్సిలర్‌లు అభినందించారు. ఈ సందర్భంగా తనకు పట్టణ అధ్యక్షునిగా ఎంపిక చేసేందుకు కృషి చేసిన దవులూరి దొరబాబుకు సురేష్ కృతజ్ఞతలు తెలిపారు.

కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత

-మాలమహానాడు, ఎంఆర్‌పిఎస్ పోటా పోటీ

-ఇరు సంఘాలను అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఎస్‌సి ఉపకులాల వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా పర్యటనతో కలెక్టరేట్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. గురువారం కలెక్టరేట్‌కు వచ్చిన కమిషన్‌కు వినతులు ఇచ్చేందుకు ఎస్‌సి, ఎస్‌టి సామాజికవర్గాలకు చెందిన అనేకమంది ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నలుమూలల నుంచి కలెక్టరేట్‌కు చేరుకున్నారు. వందలాది మంది ఎంఆర్‌పిఎస్ నాయకులు వచ్చారు. వారిని భారీ సంఖ్యలో కలెక్టరేట్‌లోకి పోలీసులు అనుమతించారు. అయితే తమ నాయకులు ముగ్గురికే అనుమతి ఇవ్వడంపై మాలమహానాడు నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో రెండు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సమయంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు కలెక్టరేట్‌లోకి చొచ్చుకుపోయే ప్రయత్నం చేవారు. పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. జెసి, డిఎస్‌పి వారికి నచ్చజెప్పి 15 మందిని లోనికి అనుమతించడంతో సద్దుమణిగింది.

ఎస్‌సి ఉప కులాల సమగ్ర వివరాలను అందించాలి

ఎస్‌సి ఉప కులాల వారిగా సామాజిక, రాజకీయ, ఆర్థిక స్థితిగతులపై ఖచ్చితమైన గణాంకాలతో సమగ్ర వివరాలను అందించాలని ఎస్‌సి ఉపకులాల వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధికారులను కోరారు. ఉమ్మడి జిల్లాలో ఎస్‌సిల్లోని ఉపకులాల వారీగా అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఉమ్మడి జిల్లాకు సంబంధించి 2011 జనాభా గణన ఆధారంగా ఎస్‌సి సామాజికవర్గానికి చెందిన గణాంకాలను ఛైర్మన్‌కు వివరించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 68.507 శాతం మాల, మాల అయ్యవారు వర్గం, 22.132 శాతం మాదిగ వర్గం, 4.873 శాతం ఆదిఆంధ్ర వర్గం, 1.556 శాతం రెల్లి వర్గం ప్రజలు ఉండగా మిగిలిన ఉప కులాలలో ఒకటి కంటె తక్కువ శాతం ఉన్నారని తెలిపారు. ఉమ్మడి జిల్లా అంతటా విస్తరించిన ఎస్‌సి జనాభా ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారని తెలిపారు. అనంతరం ఛైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఉత్తర్వులు, కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి ఉపకులాల సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతులపై అధ్యయనానికి ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తమతమ శాఖల్లో పనిచేస్తున్న ఎస్‌సి ఉద్యోగుల వివరాలను గణాంకాలతో అందించాలన్నారు. స్థానిక సంస్థల ఎస్‌సి ప్రజాప్రతినిధుల వివరాలను ఇవ్వాలని జడ్‌పి సిఇఒ, డిపిఒలను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్‌పి విక్రాంత్‌పాటిల్, జెసి రాహుల్ మీనా, అసిస్టెంట్ కలెక్టర్ హెచ్‌ఎస్.భావన, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు, కార్యకర్తలు

వినతులు స్వీకరణ

అనంతరం కలెక్టరేట్‌కు వచ్చిన ఎస్‌సిలు, వివిధ సంఘాల నాయకుల నుంచి రాజీవ్ రంజన్ మిశ్రా వినతులను స్వీకరించారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణలో మొత్తం 311 వినతులు అందాయి. సుమారుగా 2,468 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు ఎస్‌సి ఉప కుల సంఘాలు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మాట్లాడారు. వచ్చిన ఫిర్యాదులు, విజ్ఞప్తులను పూర్తిగా చర్చించి తరువాత కమిషన్ ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎస్.మల్లిబాబు, డిఎస్‌పి రఘువీర్ విష్ణు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఇన్‌ఛార్జ్ జెడీ జి.శ్రీనివాసరావు, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిడీ పి.జ్యోతిలక్ష్మీదేవి, రాజమహేంద్రవరం ఇన్‌ఛార్జ్ జెడీ ఎం.సందీప్, సూపరింటెండెంట్లు బి.చిరా, శ్రీనివాసరావు, వివిధ సహాయ సంక్షేమ అధికారులు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు

ఎస్‌సి వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ జిల్లా పర్యటన సందర్భంగా గురువారం కలెక్టరేట్ చుట్టూ పోలీస్ పహారాతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కలెక్టరేట్ వైపునకు వెళ్లే అన్ని మార్గాలను మూసి వేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మనస్తాపానికి గురై విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం రమణక్కపేటలో చోటు చేసుకుంది. స్థానికులు వివరాల ప్రకారం 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని చదువుపై దృష్టి పెట్టాలని తల్లి మందలించింది. దీంతో ఆ విద్యార్థిని మనస్తాపానికి గురై పురుగుల మందు తాగింది. వెంటనే ఆమెను వైద్యం కోసం కాకినాడ తరలించినట్లు స్థానికులు తెలిపారు.

600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని తూర్పుపాకలు గ్రామంలో గురువారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ అర్జునరావు తెలిపారు. దీనికి సంబంధించి ఒకరిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పురుగు మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

కుటుంబ కలహాల నేపథ్యంలో పురుగు మందు తాగిన వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని తాటిపర్తి గ్రామం ఎన్‌టిఆర్ కాలనీకి చెందిన రౌతు నరసయ్య (33) తన భార్యతో తగాదా పడి తన వ్యవసాయ పొలంలో ఈ నెల 18వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో తన కుటుంబ సభ్యులు ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక వైద్యం అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ జిజిహెచ్‌కి తరలించారు. అయితే చికిత్స పొందుతున్న నేపథ్యంలో అతని ఆరోగ్యం విషమించి బుధవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. మృతుని తండ్రి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - రాజానగరం

శ్రీరాంపురం రహదారిలో గురువారం రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై బొమ్మూరు ఎస్ఐ ప్రియ కుమార్ తెలిపిన వివరాలివి. చుక్కా శ్రీను (38) శ్రీరాంపురం అత్తారింటికి వెళుతుండగా దివాన్ చెరువు సెంటర్లో బివిసి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి లిఫ్ట్ అడిగి బైకు ఎక్కాడు. చైతన్య టెక్నో స్కూల్ సమీపంలో బైకు అదుపు తప్పి ఇద్దరూ పడిపోయారు. శ్రీను తలకు బలమైన గాయం తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలైన ఇంజనీరింగ్ విద్యార్థిని రాజమహేంద్రవరం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. శ్రీనుకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ట్యాంకర్ నుంచి యాసిడ్ లీక్

ప్రజాశక్తి - రాజానగరం

రాజానగరం జాతీయ రహదారి జిఎస్ఎల్ మెడికల్ కళాశాల జనరల్ ఆసుపత్రి సమీపంలో ట్యాంకర్ లారీ యాసిడ్ లీకై ప్రమాదం తప్పింది. విశాఖపట్నం నుండి దేవరపల్లి యాసిడ్ లోడ్‌తో లారీ వెళుతుండగా మెడికల్ కళాశాల సమీపంలో రెండు చోట్ల లీకైంది. దీంతో యాసిడ్ ట్యాంక్ నుండి రహదారిపై పొగలు విరజిమ్మితూ కారిపోయింది. రహదారిపై ప్రయాణిస్తున్న వారికి కొద్దిగా కళ్లు మంటలు దురదలు వచ్చాయి. రాజమహేంద్రవరం, కోరుకొండ నుంచి అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు. ట్యాకంర్ నుండి లీక్ అవుతున్న రెండు ప్రదేశాల యాసిడ్ సాంద్రతను నీళ్లతో తగ్గించుకుంటూ సమీపంలో రహదారి ప్రక్కన ఉన్న డ్రైనేజీ లోకి పంపారు.

ధాన్యం డబ్బుల కోసం ఫిర్యాదు

ప్రజాశక్తి - సీతానగరం

ధాన్యం కొనుగోలు చేసిన ఏజెంట్ డబ్బులు ఇవ్వకపోవడంతో గురువారం సీతానగరం పోలీస్ స్టేషన్‌లో బొబ్బిల్లంక గ్రామానికి చెందిన రైతులు పెండ్యాల అవిస్వామి, దాసరి వీరాస్వామి ఫిర్యాదు చేశారు. కొవ్వూరు మండలం పశివేదల గ్రామానికి చెందిన దుద్దిపూడి సూరిబాబు ధాన్యం కొనుగోలు ఏజెంట్. ఆయన అవిస్వామి వద్ద రూ.68 లక్షల మొక్కజొన్న ధాన్యం తీసుకుని రూ.45 లక్షలకు రెండు చిక్కులు ఇచ్చాడు. ఇంకా రూ.23 లక్షలు ఇవ్వాల్సి ఉంది. వీరాస్వామి వద్ద ధాన్యం కొనుగోలు చేసిన రూ.21 లక్షల సొమ్ములు ఇవ్వలేదు. దీంతో డబ్బులు ఇవ్వాలని రైతులు అడిగారు. డబ్బులు ఇవ్వకపోగా సూరిబాబు బెదిస్తున్నాడని బాధిత రైతులు ఫిర్యాదు చేశారు. సీతానగరం ఎస్ఐ రామ్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బైకుల చోరీపై ఫిర్యాదులు

ప్రజాశక్తి - సీతానగరం

బైకులు చోరీకి గురైనట్లు ఉండేశ్వరపురం గ్రామానికి చెందిన కుప్పల యేసుబాబు, చింతా సత్యనారాయణ గురువారం సీతానగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. యేసుబాబు, సత్యనారాయణకు చెందిన బైకులను ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారని ఫిర్యాదు చేశారు. సీతానగరం ఎస్ఐ రామ్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

కత్తులతో యువకుల దాడి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

గొల్లప్రోలులో ఇద్దరు యువకులు కత్తులతో ఇద్దరిపై దాడి చేశారు. సాయిబాబా గుడి వద్దకు కత్తులతో చేరుకుని సూరంపేటకు చెందిన ఎ.వీరబాబు(37), దళితపేటకు చెందిన జి.నాగేశ్వరరావు(53)లపై దాడి చేశారు. ఈ దాడిలో వారు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు బాధితులను పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దాడి మద్యం మత్తులో జరిగిందా? లేదా గంజాయి మత్తులో జరిగిందా? అనే దానిపై వివరాలు తెలియాల్సి ఉంది.

యోగా జట్టుకు ఆదిత్య విద్యార్థి ఎంపిక

గండేపల్లి : మండలంలోని సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సరం ఎఐఎంఎల్ విద్యార్థి కె.గణేష్ 1జెఎన్‌టియుకె యోగ మెన్ టీంకు ఎంపిక అయినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్ తెలిపారు. ఈ నెల 24 నుంచి 28 వరకూ ఒడిశాలోని కెఐఐఎస్ యూనివర్శిటీలో నిర్వహించే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నీలో పాల్గొంటాడని తెలిపారు.

పలు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

జిల్లాలోని పలు గ్రామాల్లో మంగళవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు, ప్రజలు వినతిపత్రాలను అందజేశారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

కాజులూరు కాజులూరులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. భూ సమస్యలకు సంబంధించి తక్షణ పరిష్కారం కొరకు ఈ సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా కౌలు రైతుల సంఘం కార్యదర్శి వల్లు రాజబాబు మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో రైతుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. రైతులకు, ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించిన తరువాతే సదస్సులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ సదస్సులో ఆర్ఐ వేగేశ్వరరావు, విఆర్‌ఒలు, సర్వేయర్లు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. **గొల్లప్రోలు** మండలంలోని చిన్న జగ్గంపేటలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కెవి.సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకే గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని అన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సదస్సులో డిటి సౌమ్య, మండల సర్వేయర్ కేదారేశ్వరరావు, విఆర్‌ఒలు, సిబ్బంది పాల్గొన్నారు. **పెద్దాపురం** మండలం కట్టమూరు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 86 దరఖాస్తులు అందాయి. ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి మాట్లాడారు. ఈ సదస్సులో సర్పంచ్ దిమ్మల పుష్పరత్నం, ఎంపిటిసి సభ్యులు ఉప్పటి ప్రసాద్, నల్లల సూర్యకుమారి, నాయకులు ఏలేటి సుబ్బారావు, మాదిరెడ్డి రామకృష్ణ, నండూరి ప్రసాద్, పెద్ది ధర్మరాజు పాల్గొన్నారు. **సామర్లకోట** మండలం చంద్రంపాలెం గ్రామంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. పలు సమస్యలపై రైతులు వినతులు అందజేశారు. ఈ సదస్సులో తహశీల్దార్ కె.చంద్రశేఖర రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిటి యడ్ల శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. **తాళ్లరేవు** మండలంలోని పి.మల్లవరంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సు లో 33 దరఖాస్తుల అందినట్లు తహశీల్దార్ పి.త్రినాధరావు తెలిపారు. సర్పంచ్ పంపన రామకృష్ణ అధ్యక్షతన రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ముమ్మిడివరం ఎఎంసి ఛైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, ధూళిపూడి వెంకట రమణ, పంచాయతీ కార్యదర్శి సూరంపూడి వెంకటరమణ, నాయకులు విళ్ల వీర, ముత్యాల జయలక్ష్మి, నిమ్మకాయల మూర్తి పాల్గొన్నారు. **గండేపల్లి** మండలంలోని బొర్రంపాలెం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ శ్రీరమణి పాల్గొని పజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ ప్రజలకు సంబంధించిన సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకుని వాటిని పరిష్కారం చేసేందుకే రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస్, యర్రంశెట్టి బాబ్జి, పల్లపు విష్ణు, చిన్నారావు, మండల సర్వేయర్, ఆర్ఐ సురేష్, విఆర్‌ఒలు పాల్గొన్నారు.



కాజులూరు సదస్సులో మాట్లాడుతున్న వల్లు రాజబాబు

మాదకద్రవ్యాల అనర్థాలపై పోటీలు

ప్రజాశక్తి - కాకినాడ

డ్రగ్ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలలో మదకద్రవ్యాల వ్యతిరేకతపై వ్యాసరచన, పోస్టర్ తయారీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు మాట్లాడారు. మత్తు పదార్థాల వ్యతిరేకతపై అవగాహన కల్పిస్తూ, ప్రతి ఒక్కరిని భాగస్వాములు చేయాలనే లక్ష్యంతో ఈ పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అకడమిక్ డైరెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందుకున్నారు. వ్యాసరచన పోటీల్లో కె.చంద్రిక ప్రథమ, జె.మహేశ్వరి ద్వితీయ, ఎ.జాస్మిన్, తృతీయ బహుమతులు సాధించారు. పోస్టర్ తయారీ పోటీల్లో ఆశ లక్ష్మి ప్రథమ, ఏ కమలాదేవి ద్వితీయ, ఎస్ లతీఫ్ తతీయ బహుమతులు సాధించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన డిఎఫ్‌ఎపి బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సత్యనారాయణ, డిఎఫ్ ఎపి నోడల్ ఆఫీసర్ టి.తేజేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఐ.గౌరిప్రియ, విద్యార్థులు పాల్గొన్నారు.



విజేతలను అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

అమిత్ షా రాజీనామా చేయాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను ఎగతాళి చేస్తూ వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్ షా తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని బిఎస్‌పి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ జుత్తుక నాగేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అంబేద్కర్ పట్ల చులకనగా మాట్లాడటం బిజెపి నేతలకు ఒక ఫ్యాషన్‌గా మారిపోయిందన్నారు. దళిత, పీడిత వర్గాలకు అంబేద్కర్ నిజంగానే దేవుడని, అటువంటి అంబేద్కర్‌ను అవమానపర్చేలా వ్యాఖ్యలు చేసిన అమిత్ షా తక్షణమే మంత్రి పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

వరి కోతలు వాయిదా వేసుకోవాలి

ప్రజాశక్తి - రౌతులపూడి

తుపాను హెచ్చరికలతో రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రెడ్డి ఈశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తుపాను ప్రభావంతో మండలంలో వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలను దృష్టిలో పెట్టుకుని రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవలని, ఇప్పటికే కోతలు కోసిన రైతులు ఆ పంటను ఒబ్బిడి చేసుకోవాలని సూచించారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని రాయ భూపాలపట్నం గ్రామంలో ఉద్యాన శాఖ, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో మండల ఉద్యాన శాఖ అధికారి ఎస్.సుజాత మాట్లాడుతూ ఆయిల్ ఫాం సాగు ద్వారా అధికాదాయం పొందవచ్చన్నారు. పతంజలి ఫుడ్స్ ఎజిఎం డి.రవీంద్ర ఆయిల్ ఫాం సాగు విధానాలు, విస్తీర్ణం, ఆదాయ వనరులు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో ఫీల్డ్ ఆఫీసర్ డిఎల్.వెంకటేశ్వర్, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ ఎం.వెంకట సాయి, రైతులు పాల్గొన్నారు.

భవిత కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణంలో ఉన్న భవిత కేంద్రాన్ని జిల్లా సహిత విద్య సమన్వయకర్త, సిఎంఒ చామంతి నాగేశ్వరరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దివ్యాంగ విద్యార్థులలో ప్రగతిని పరిశీలించి వారితో ముచ్చటించారు. విద్యార్థులకు అనుగుణంగా టిఎల్ఎం తయారు చేయమని సూచించారు. మండలంలో దివ్యాంగుల డేటాను పరిశీలించి వారికి లభిస్తున్న సేవలపై ఐఇఆర్‌టిలతో సమీక్షించారు. కార్డులను పరిశీలించి తగిన సూచనలు ఇచ్చారు. అనంతరం స్థానిక మండల వనరుల కేంద్రంను సందర్శించి అపార్ స్టేటస్ పెంచుటకు సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఆర్‌టి టీచర్ అనిత, సిబ్బంది పాల్గొన్నారు.

జనసేన ఇన్‌ఛార్జ్‌ని అడ్డుకున్న మత్స్యకారులు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

పిఠాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ మర్రెడ్డి శ్రీనివాసును కోనపాపపేట గ్రామానికి చెందిన మత్స్యకారులు నిలదీశారు. సముద్ర అలల తాకిడికి ధ్వంసం అవుతున్న గృహాలను పరిశీలించేందుకు గురువారం ఆయన కోనపాపపేట చేరుకున్నారు. ఎంతో కాలంగా మత్స్యకార గృహాలు అలల తాకిడికి సముద్ర గర్భంలో కలిసిపోతున్నాయని, వాటిని చూసేందుకు అనేక మంది వస్తూనే ఉన్నారని, కానీ సమస్యకు పరిష్కారం చూపడం లేదంటూ మత్స్యకారులు మర్రెడ్డి శ్రీనివాస్‌ను అడ్డుకున్నారు. దీంతో ఆయన చాలా సమయంలో ఆయన కార్‌లోనే ఉండిపోయారు. దీంతో జనసేన నాయకులు మత్స్యకారుల నాయకులతో సంప్రదింపులు చేసి సమస్యలను డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకు కొన్ని వెళ్లి మత్స్యకార సమస్యలను సత్వరమే పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో మత్స్యకారులు ఆందోళన విరమించారు.



జనసేన ఇన్‌ఛార్జ్ కారుని అడ్డగిస్తున్న మత్స్యకారులు

పంటల బీమాను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ప్రతి రైతు పంటల బీమాను సద్వినియోగం చేసుకుని ఆర్థిక భరోసా పొందాలని మండల వ్యవసాయ అధికారి బి.జ్యోతి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని రమణయ్యపేట గ్రామంలో పంటల బీమాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి రైతు ఎకరానికి రూ.630 ఈ నెల 31 వ తేదీలోగా చెల్లించాలన్నారు. అపరాల రైతులు ఎకరాకు రూ.300 ప్రీమియం చెల్లించాలన్నారు. మీ దగ్గర్లో ఉన్న మీసేవ సెంటర్లో సొమ్ము చెల్లించి బీమా చేయించుకోవాలని కోరారు. బీమా పొందిన రైతులు ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోయిన పూర్తిస్థాయిలో నష్టపరిహారం పొందే అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి రైతు వినియోగించుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సర్పంచ్ గుమ్ములూరి జగదీశ్వరి, సునీత, పలివెల శ్రీనివాస్, చెల్లా రాజారావు, ముదరా కామరాజు, గ్రామ కార్యదర్శి వీర్రాజు, వ్యవసాయ సిబ్బంది దాడిశెట్టి దివ్యచక్ర, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఈ-శ్రమ్ నమోదుతో ఆర్థిక భద్రత

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ-శ్రమ నమోదుతో అసంఘటితరంగ కార్మికులకు ఆర్థిక భరోసా లభిస్తుందని, ఈ అవకాశాన్ని కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని సిఐటియు నాయకులు రాజా అన్నారు. గురువారం రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో 'ఈ- శ్రమ' నమోదు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంయాయన మాట్లాడుతూ నెలకు రూ.15 వేల ఆదాయం కలిగిన కార్మికులు ఈ పథకానికి అర్హులని అన్నారు. 16- 59 మధ్య వయస్సు వారు నమోదు చేసుకోవాలని సూచించారు. పాక్షికంగా వికలాంగులైతే రూ.లక్ష, మరణిస్తే రూ.2 లక్షలు బీమా సంస్థ కుటుంబ సభ్యులకు చెల్లిస్తుందని రాజా తెలిపారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, సిహెచ్.అజయ్ కుమార్, రవిశంకర్ పట్నాయక్, శ్రీలక్ష్మి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

స్నేహితుని వైద్యానికి రూ. 66 వేల ఆర్థిక సాయం

ప్రజాశక్తి - తాళ్లరేవు

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇంటివద్దే ఉంటున్న స్నేహితునికి తోటి మిత్రులు రూ.66 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. పోలేకుర్రు గ్రామానికి చెందిన పి.శ్రవణ్‌కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న చిన్ననాటి స్నేహితులు వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి గ్రూప్‌లో ఉన్న సభ్యులు 43 మంది పంపిన సొమ్ము రూ.66,600లను గురువారం అందజేశారు.ఈ కార్యక్రమంలో పేరూరి శ్రీనివాస్, కూర్మదాసు, మణికృష్ణ, ధూళిపూడి సుబ్బారావు, ఏడిద సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

ఏకసభ్య కమిషన్‌కు వినతులు

ప్రజాశక్తి - సామర్లకోట, కరప

ఎస్‌సి వర్గీకరణ రాజ్యాంగంలోని ఆర్టికల్ 341కి పూర్తి వ్యతిరేకంగా ఉందని దళిత యువజన సంఘం గౌరవ అధ్యక్షులు నతేల హరిబాబు అన్నారు. గురువారం వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వ నయమించిన ఏకసభ్య కమిషన్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌సిసామాజిక వర్గంలోని అన్ని ఉపకులాలకు పెద్దఎత్తున నష్టం కలిగించడం జరుగుతుందని, అణగారిన కులాలు ఎస్‌సి వర్గీకరణను పూర్తిగా వ్యతిరేకించడం, తిరస్కరించడం జరుగుతుందన్నారు. అలాగే ఎస్‌సి వర్గీకరణ చేయాలని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కో కన్వీనర్ వల్లూరి నాని ఏకసభ్య కమిషన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. తక్షణమే వర్గీకరణ చేపట్టి తమకు న్యాయం చెయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో నందిక చక్రం, మందపల్లి వెంకన్న, మల్లెల మహేష్, చిట్టిబాబు పాల్గొన్నారు. అలాగే కరప మండల జెఎసి సభ్యులు సవిలే రాజేష్ ఎస్‌సి వర్గీకరణకు వ్యతిరేకంగా ఏకసభ్య కమిషన్‌కు వినతిపత్రం అందజేశారు. క్రిమిలేయర్ విధానం భారతదేశంలోని మొత్తం జనాభాకు వర్తిస్తుందని, ఒక్క కులానికి మాత్రం వర్తించదని అన్నారు.రిజర్వేషన్ అనేది కులం ఆధారంగా ఇవ్వడం జరిగిందని, నేడు ఆర్థిక ప్రాతిపదికన కులాలను విభజించి, ఆయా కులాలకు మనుగడ లేకుండా చేయడమే అవుతుందన్నారు.

నూతన వస్త్రాల పంపిణీ

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

రమణయ్యపేట అడబాల ట్రస్ట్ కార్యాలయంలో కసిరెడ్డి అచ్యుతరామయ్య వర్ధంతిని పురస్కరించుకుని వృద్ధులకు గురువారం నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మికవేత్త రవిశంకర్ పట్నాయక్ మాట్లాడారు.

అబ్బులు మృతి తీరని లోటు

ప్రజాశక్తి - గండేపల్లి

ఉప్పలపాడుకు చెందిన జనసేనపార్టీ నాయకులు మేడిబోయిన శ్రీను తండ్రి, సొసైటీ మాజీ అధ్యక్షులు మేడిపోయిన అబ్బులు మతి తీరనిలోటని జగ్గంపేట నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ తుమ్మలపల్లి రమేష్ అన్నారు. గురువారం శ్రీను, రామకృష్ణ కుటుంబాన్ని పరామర్శించి ఆయన పరామర్శించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పరామర్శించిన వారిలో సత్యదేవ నర్సరీ అధినేతలు పుల్లా పెద సత్యనారాయణ, చిన్న సత్యనారాయణ, ఎజిపి.రమాకాంత్‌రెడ్డి, రామ కుర్తి మూర్తి,పేపకాయల రాంబాబు, సింగులూరి రామ్ దీపు, ఉలిసి ఐరాజు, గంగాధర్ పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - సామర్లకోట

కుమార రామ భీమేశ్వరాలయ అన్నదాన ట్రస్ట్‌కు సామర్లకోటకు చెందిన గుండపు సత్యవతి తన మనవడు గుండపు ప్రదీప్‌కుమార్ పేరున రూ.లక్ష విరాళం అందజేశారు. గురువారం ఆలయంలో చెక్కు రూపంలో ఆలయ అధికారులకు ఆమె విరాళాన్ని అందజేశారు. వారికి కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం ఆలయ పండితులచే వేద ఆశీర్వచనము అందించి స్వామి వారి చిత్ర పటాన్ని, ప్రసాదాన్ని అందజేశారు.